ప్రమాదకరంగా రిజర్వాయర్

మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం

- జేఎన్‌టీయూ నివేదిక కోసం ఎదురు చూపులు
- శిథిలావస్థలో సీతాఫల్‌మండి రిజర్వాయర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని జలమండలిని చెందిన రిజర్వాయర్ (వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకు) దినదినం శిథిలావస్థకు చేరుతుంది. సీతాఫల్‌మండిలోని జలమండలి కార్యాలయం ప్రాంగణంలో నెలకొని ఉన్న ఈ ట్యాంకుపై భాగం నుంచి పెచ్చులు ఊడుతుండడం, పగుళ్లు ఏర్పడుతుండడంతో జలమండలి అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం వరకు పై ట్యాంకు నుంచి మాత్రమే పెచ్చులు ఊడుతుండడం, నీళ్లు కారుతుండడం వంటి లోపాలు కనిపించేవి. క్రమేణా రిజ్వాయర్ నిర్మాణానికి కీలకంగా ఉండే పిల్లర్లు కూడా బీటలు వారుతుండడంతో ప్రమాదకర పరిస్థితులు తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తుంది. మరమ్మతులతో ఎప్పటికప్పుడు అధికారులు సరిపెడుతున్నా ఫలితాలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి.

40 ఏళ్ల క్రితం నిర్మాణం..

సీతాఫల్‌మండిలోని జలమండలి కార్యాలయం ప్రాంగణంలోని రిజ్వాయర్ 40 ఏళ్ల క్రితం నిర్మించింది కావడం గమనార్హం. నిర్మించిన నాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితంగానే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా శిథిలావస్థకు చేరేలా తయారైందని తెలుస్తుంది. జలమండలి ప్రాంగణంలోనే మీ సేవ కార్యాలయం, పక్కన్నే విద్యుత్‌శాఖ కార్యాలయం ఉన్నాయి. ఈ కార్యాలయాలక ఉవచ్చే సందర్శకులంతా రిజర్వాయర్ పిల్లర్లు పగుళ్లు పారడం, రిజర్వాయర్ ట్యాంకు నుంచి పెచ్చులు ఊడుతుండడం, తాగునీరు లీకేజీలు అవుతుందదడం చూసి విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఫలించలి మరమ్మతులు..

నిర్మించిన 38 ఏళ్ల తర్వాత మొదటిసారి జలమండలి అధికారులు రెండేళ్ల క్రితం మరమ్మతు పనులు చేశారు. ఇందుకోసం రూ.12 లక్షలు వెచ్చించారు. మరమ్మతు పనులు పూర్తిచేసి ఆ మీదట వచ్చే ఫలితాలు సమీక్షించి రిజర్వాయర్ విషయంలో మరో నిర్ణయం తీసుకోవాలని అప్పట్లోనే అధికారులు నిర్ణయించారు. అయితే మనమ్మతులు పూర్తయిన నెల నుంచే మళ్లీ అవే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ రిజర్వాయర్‌ను 0.4 మిలియన్ గ్యాలరీల తాగునీటి స్టోరేజీ సామర్థ్యంతో నిర్మించారు. ఈ ప్రాంతంలోని 2500 గృహాలకు ఈ రిజర్వాయర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 2004లో మొదటిసారి ఈ రిజర్వాయర్‌కు మరమ్మతు పనులు చేయించారు. మళ్లీ పెచ్చులు ఊడుతుండడం, ఇనుప ఊచలు బయటకు తేలుతుండడంతో 2003లో రెండవ సారి రిజర్వాయర్ మరమ్మతు పనులు అనివార్యం అయ్యాయి. అయినప్పటికీ పరిష్కారం లభించలేదు.

స్థానికుల డిమాండ్ ఇదీ..

ఇదిలా ఉండగా నివేదికలు, సిఫారసుల పేరుతో అధికారులు తాత్సారం చేయకుండా కొత్త రిజర్వాయర్ నిర్మాణం కోసం చర్యలు ప్రారంభించాలని జ్ధానిక ప్రజలు కోరుతున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని మారేడుపల్లి, లాలాగూడ, తార్నాక ప్రాంతాల్లో అధునాతన పద్ధతుల ద్వారా కొత్త రిజర్వాయర్‌ను సీతాఫల్‌మండిలో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్త రిజర్వాయర్ల నిర్మాణం ద్వారా ఆయా ప్రాంతాల్లో వాటర్ స్టోరేజీ సామర్థ్యం పెరిగి ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పాయని చెబుతున్నారు. అదే తరహాలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా పరిణమించిన రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయడం నిలిపివేసి కొత్త రిసర్వాయర్ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకుంటున్న సీతాఫల్‌మండి రిజర్వాయర్

నిపుణుల పర్యవేక్షణకు సిఫారసు..

రిజర్వాయర్‌ను నిర్మించి నాలుగు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో రిజర్వాయర్ స్థితిగతులపై పర్యవేక్షణ చేసి ఒక నివేదికను ఇవ్వాలని సికింద్రాబాద్ జలమండలి అధికారులు జేఎన్‌టీయూ సాంకేతిక నిపుణులను కోరారు. ఈ మేరకు అక్కడి ఇంజినీర్లు పర్యవేక్షించి నివేదిక ఇచ్చిన మీదట తాము తదుపరి కార్యాచరణ గురించి నిర్ణం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. రిజర్వాయర్ శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే కానీ అత్యంత ప్రమాదకర పరిస్థితులు లేవని ఇక్కడి అధికారులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ సుభాష్ నగర్, లక్ష్మీనారాయణ కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సికింద్రాబాద్ మురళికృష్ణ తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుభాషనగర్, రవికాలనీ, పెద్ద కమేళా, లాలామీయ బస్తీ, మిలిటరీ డైరిఫాం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సుభాషనగర్, ఆర్టీసీ కాలనీ, టీచర్స్‌కాలనీ, గన్‌రాక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: లాలాగూడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యానికేతన్, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు లంబాడీ బస్తీ, కనకదుర్గ అపార్ట్‌మెంట్, సండే మార్కెట్, విజయ డైరీ, గరోండ అపార్ట్‌మెంట్, డేవిడ్ మెమోరియల్ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా.23, నల్లవంకాయ 23, పాడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 42, పందిరి బీర 38, క్యాబేజీ 17, క్యారెట్ 40, దొండ 15, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 19, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్ అందజేత



కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేస్తున్న యువక్ పరిషత్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్: టెరాపంత్ యువక్ పరిషత్ తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. భోలక్‌పూర్ మేకల మండిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్స్, ప్రింటర్లు అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పరిషత్ జాతీయ అధ్యక్షులు రమేష్‌జీదాగా, ఉపాధ్యక్షులు పవన్‌జీమండోట్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అభినందన్‌జీ నహతా తదితరులు కలిసి ప్రధానోపాధ్యాయులు స్వరూపకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అన్న దృక్పథంలో పేద విద్యార్థుల విద్య కోసం ఈ కంప్యూటర్లు అందజేశామన్నారు. సకల సమస్యల పరిష్కారానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాల, కుటుంబానికి మంచి పేరు తేవాలన్నారు.

సెయింట్ ఆంథోని చర్చిలో ఫీస్ట్ వేడుకలు

రసూల్‌పురా: బాలంరాయి సెయింట్ ఆంథోని చర్చిలో ఆదివారం ఫీస్ట్ వేడుకలు నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ అమర్ ఎస్‌జే రెక్టార్, టీపీసీసీ కార్యదర్శి రాజేష్ యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వందలాది క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ మరియాదాస్ మేకల, రెవరెండ్ ఫాదర్ బాల జోసేఫ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విజయ డెయిరీ కార్మికుడి మృతి



రవి (ఫైల్)

లాలాపేట: విజయ డెయిరీలో ఈనెల 13న చోటుచేసుకున్న బ్లాస్ట్‌లో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు రవి (50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. శ్రీధర్‌రెడ్డి కాంట్రాక్టర్ కింద కొన్నేళ్లుగా టెక్నీషియన్‌గా విజయ డెయిరీలో బాదాం మిల్క్ తయారీ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణ సమయంలో స్టెరిలైజర్ స్టీమ్ ఎక్కువై ఒక్కసారిగా బ్లాస్టైంది. ఈ ఘటనలో రవితో పాటు మరి కొందరు కార్మికులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన రవిని మెరుగైన చికిత్స కోసం డీఆర్‌డీఏ హాస్పిటల్‌కి అక్కడి నుంచి ఎల్‌బీనగర్ అపోలో హాస్పిటల్‌కు తరలించారు. 9 రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు.

నేడు మాస శివరాత్రి పూజలు

సనత్‌నగర్: జ్యేష్ఠ మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్ధశి సందర్భంగా ఉదయం సోమవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం, సాయంత్రం 6.30 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయన్నారు.

తెలంగాణ జీపీ ఉద్యోగుల జేఏసీ ఆవిర్భావం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ(జీపీ) ఉద్యోగుల సంఘ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ఐదు సంఘాలు(తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం, తెలంగాణ గ్రామపంచాయతీ కారోబర్ల సిబ్బంది యూనియన్, కారోబర్స్ అండ్ బిల్ కలెక్టర్ యూనియన్, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్, బీఆర్‌టీయూ) అధ్యక్షతన జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా మామిడాల నర్సింహులు, వైస్ చైర్మన్‌గా బింగి గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కె.నాయుడు, కార్యదర్శిగా ఓరుగంటి రఘు, చాతల్ల సదానందం, గూని గంగారాం, కోశాధికారిగా సాదుల శ్రీకాంత్, పిల్లి రవి, ప్రచార కార్యదర్శిగా ఎండి. యాకూబ్ పాషా, సీహెచ్.మల్లాచారి, పి.బాలరాజు ఎన్నికయ్యారు.

విశ్వకర్మలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బండ చంద్రారెడ్డి

లాలాపేట: విశ్వకర్మలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం లాలాపేటలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హైదరాబాద్ నగరం నుంచి శ్రీశైలం వరకు నిర్వహించతలపెట్టిన చైతన్య యాత్ర విశ్వకర్మ యువ యాత్ర బైక్ ర్యాలీని చంద్రారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను తీర్చడంలో విశ్వకర్మల సేవలు అభినందనీయం అన్నారు. పుష్పగిరి విశ్వనాథ్, చొల్లేటి ప్రభాకరచారి, కూరెల్లి శివరాం, జలాల్పూరం సదానందచారి ఆధ్వర్యంలో లాలాపేట నుంచి ఈ యాత్రలో దాదాపు 500 మంది పాల్గొన్నారు.

మసీద్ లీజు సమస్యపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం ప్రతినిధులు

బొల్లారం: కంటోన్మెంట్ 8వ వార్డ్‌లోని రిసాలబజార్ ప్రాంతంలో ఉన్న మసీదుకు సంబంధించిన లీజు సమస్యపై మసీద్ ప్రతినిధులు, ముస్లింలు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. 90 ఏళ్లుగా లీజులో కొనసాగుతున్న మసీద్ స్థలంపై కంటోన్మెంట్ బోర్డు ఇటీవల ఏడాదికి రూ.3.3 లక్షలు లీజు చెల్లించాలని నిర్ణయించడంతో మసీద్ నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. ప్రార్థనా స్థలంగా కొనసాగుతున్న మసీదుకు తక్కువ మొత్తంలో లీజు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ విషయాన్ని కంటోన్మెంట్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి నా వంతు ప్రయత్నం చేస్తా అని హామీ ఇచ్చారు.

పార్కు అభివృద్ధికి కృషి

పద్మారావునగర్: పద్మారావునగర్ పార్కు సమగ్రాభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్కులో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన ఉపాధ్యక్షులు చక్రధర్ యాదవ్, జీకే రావు, సలహాదారు ఇ. చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, ఆజేయ్‌తో కలిసి మాట్లాడారు. పార్కులో జీహెచ్ఎంసీ అధికారులు నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందన్నారు. పార్కులో సెక్యూరిటీ సిబ్బందితో పాటు శుభ్రత కోసం సిబ్బంది సంఖ్యను పెంచాలన్నారు. పార్కులో నెలకొన్న సమస్యలపై త్వరలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్లను కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న బోనాల వేడుకల కోసం ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా టి. వెంకటరమణ, పార్కులో కార్యక్రమాల నిర్వాహక కమిటీ కన్వీనర్‌గా అజేయ్‌కుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత శ్యామ్

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని సాక్షాత్తు ప్రభుత్వ అధికారులే రాతపూర్వకంగా తెలియజేస్తున్నారని ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ ఆరోపించారు. ఆదివారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం ద్వారా ముషీరాబాద్ నియోజకవర్గంలో చేయూత పథకాన్ని, మహాలక్ష్మి పథకాన్ని, కల్యాణలక్ష్మి తులం బంగారం ఎంత మందికి ఇచ్చారని దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అయితే ఏ ఒక్కటీ ఇంత వరకు అమలు కావడం లేదని ముషీరాబాద్ తహసీల్దార్ లిఖిత పూర్వకంగా తెలియజేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా ఇంత వరకు అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని నిలదీశారు. పథకాల ఆశ చూపి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఆర్టీఐపై ప్రభుత్వానికి పారదర్శకత ఉండాలి



మాట్లాడుతున్న చంటి ముదిరాజ్

హిమాయత్‌నగర్: సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత, అధికారులు జవాబుదారిగా ఉండాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. డా.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. కమిటీ రాష్ట్ర నాయకులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, అలీ, ఎస్.దిలీప్ రావ్, గోపీనాథ్ కట్టికోల, చింతల క్రిష్ణ, వై.కార్తీక్ రెడ్డి, బి.లక్ష్మణ్, ఆర్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

సనత్‌నగర్: ఎస్సీరోడ్డులోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఏటీఎంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ నెల 15న ఉదయం 6.20 ఏటీఎంతో పాటు నిఘా కెమెరాలను ధ్వంసం చేసి చోరీకి యత్నించగా విఫలమై వెళ్లిపోయారు. ఏటీఎం చోరీ యత్నం జరిగినట్లు గుర్తించి సమీపంలోని మరో భవనానికి చెందిన కాపలాదారు బ్యాంక్ అధికారులకు సమాచారం ఇవ్వగా మేనేజర్ ఎం.సుధీర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పనిచేసిన సంస్థకే కన్నం

వ్యక్తి అరెస్టు

సనత్‌నగర్: గతంలో పనిచేసిన సంస్థకే కన్నం వేసిన ఓ ప్రబుద్ధుడు రూ.46 లక్షలు అపహరించిన వ్యక్తిని బేగంపేట పోలీసులు రిమాండ్‌కు తరలించి నిందితుడి నుంచి రూ.46 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ రశ్మి పెరుమాళ్ తెలిపారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాటిగడ్డ సన్ స్టీల్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గతంలో అదే కంపెనీలో పనిచేసిన గిరిదార్‌సింగ్ అనే వ్యక్తిని పలు కారణాలతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. శుక్రవారం అర్ధరాత్రి సన్ స్టీల్స్ కంపెనీ వెనుక వైపు రంధ్రంలో నుంచి అద్దాన్ని ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించాడు. అనంతరం లాకర్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుని బస్సులో పరారైనట్లు పోలీసులు తెలిపారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని ఆదిలాబాద్‌లో గుర్తించి అక్కడి పోలీసుల సహకారంతో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

20 డిఫెన్స్ మద్యం బాటిళ్ల పట్టివేత

సికింద్రాబాద్: హరియాణాకు చెందిన 20 డిఫెన్స్ మద్యం బాటిళ్లను పట్టుకొని కారును సీజ్ చేసి నలుగురి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కిషన్ తెలిపారు. కారులో డిఫెన్స్ మద్యం తరలిస్తున్నారనే సమాచారం తెలుసుకొని రంగారెడ్డి ఏసీ ఎన్‌ఫోర్స్‌మంట్ సీఐ సుభాష్ చంద్ర, ఇతర సిబ్బందితో కలిసి వికారాబాద్ సమీపంలోని ఎన్నపల్లి ఎక్స్‌రోడ్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు కారులో లభించిన్నట్లు తెలిపారు. 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని శ్రీనాథ్ రెడ్డి, జీవన్ రెడ్డి, అన్వేష్‌రెడ్డి, సురేందర్ రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కిషన్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఆదివారం మధ్యాహ్నం చిలకలగూడ చౌరస్తా వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడికి 55-60 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై తెలుపు, నేవీ బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు.

సత్యసాయిబాబా జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

నల్లకుంట: భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 15 నుంచి 24వ తేదీ వరకు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో బాబా శత జయంతి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని శ్రీసత్యసాయి సేవా సంస్థల(ఎస్ఎస్ఎస్ఎస్) అఖిల భారత అధ్యక్షుడు నిమీష్ పాండ్య తెలిపారు.

చిన్నారుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లలకు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై కూడా ఉందని చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ స్వామిజీ సర్వేశానంద అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో న్యూ ఎరా జూనియర్ కాలేజ్, సెంట్ అడమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో ఓరియన్‌టేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్వామిజీ సర్వేశానంద మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక సమాజంలో విద్యార్థులు, ప్రశ్చాత్య సంస్కృతి వైపు అడుగులు వేస్తున్నారని... అందుకే వారిని పుస్తక పఠనం వైపు మళ్లించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ... పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నేటి పిల్లలు మొబైల్ ఫోన్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మొబైల్ వాడకాన్ని, ఫేస్‌బుక్‌లో పిల్లలు మునగకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది అన్నారు. పిల్లల ఎదుగుదలలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరం అన్నారు.



ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ అన్నారు. దిగంబర్ జైన్ సోషల్ గ్రూప్ హైదరాబాద్ అధ్యక్షుడు వినయ్ గంగవాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీపీఆర్ ట్రైనింగ్ అండ్ బేసిక్ లైఫ్ సపోర్ట్, దిల్ కీ బాత్ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యశోద హాస్పిటల్స్ డాక్టర్ కల జితేందర్ మాట్లాడుతూ గుండెను ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్ జి.రామన్‌గౌడ్, పడాల శ్రీనివాస్‌గౌడ్, జై.కృష్ణగౌడ్, కే.శేఖర్, సుజాత, హితేష్, దిగంబర్ జెన్, సోషల్ గ్రూప్ హైదరాబాద్ సభ్యులు దినేష్ జెన్, సంగీత జెన్, ప్రవీణ్ పాండ్యా పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: అహర్నిశలూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, అర్ధరాత్రి పిలిచినా పలుకుతానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఆలిండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 29వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం గోల్కొండ చౌరస్తాలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రైస్తవులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా తన వంతుగా కృషి చేస్తారన్నారు. ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గిడియన్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ... సంస్థ ఆధ్వర్యంలో క్రైస్తవ సమాజం అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. సంస్థ పక్షాన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డేవిడ్ కడారి, ఆర్చ్ బిషప్ ఎమ్మెస్ కడారి, ఏఐసీఎఫ్ అంతర్జాతీయ ప్రతినిధి కల్యాణి చొప్పల (కువైట్), జయశ్రీ టైటిల్, గ్రేస్ నిర్మల, నిత్య సుజాత, సారా అరుణోదయ, ఆనంద్‌కుమార్, శ్యామ్యూల్‌జాన్, ఆరోస్, డాక్టర్ ఆరోస్ మేదా, బీఆర్ఎస్ నేత రావులపాటి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భూముల

చరిత్ర తెలుసుకుని ముందుకు పోవాలి



మాట్లాడుతున్న లీగల్ అడ్వైజర్ గడ్డం ఏబెల్

పంజగుట్ట: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు చేపట్టే ముందు కంటోన్మెంట్ భూముల చరిత్ర తెలుసుకోవాలని నవాబ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ ప్రాజెక్టు చేపట్టే ప్రాంతంలో వేలాది ఎకరాలు నవాబ్ కుటుంబాలకు చెందిన భూములు ఉన్నాయని వాటిని పరిగణలోకి తీసుకోకుండా ప్రాజెక్టు చేపడితే మున్ముందు చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ చైర్మన్ అమీర్ అజీజ్ ఖాన్, లీగల్ అడ్వైజర్ గడ్డం ఏబెల్, అధ్యక్షుడు జకీర్ హుస్సేన్ మాట్లాడుతూ..కంటోన్మెంట్ భూములతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, అది మొత్తం ప్రైవేట్ వ్యక్తులకు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందినది, నవాబ్ కుటుంబాలకు చెందిన స్థలాలు అని కేంద్రం జోక్యం చేసుకుని కంటోన్మెంట్ బోర్డు ఏర్పాటు చేసి అక్కడ నివసిస్తున్న నాలుగు లక్షల మంది అభివృద్ధికి నోచుకోకుండా చేశారని తెలిపారు. కంటోన్మెంట్ పరిధిలో సాలార్జంగ్ నవాబ్‌కు చెందినవే 2300 ఎకరాల భూమి ఉందని, ఫక్రూ వుల్ ముల్క్ నవాబ్, ఆస్మాన్ జాహి పైగా భూబులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పటికే అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ లీగల్ టీం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అనుబంధ సంస్థలకు కూడా నోటీసులు ఇచ్చామని ఆ నోటీసులకు ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభించే ముందు ప్రభుత్వం ఈ భూములు ఎవరివో తెలుసుకునేందుకు ఒక జ్యుడీషియన్ విచారణ, నిజనిర్ధారణ కమిటీ వేసి నిజమైన హక్కుదారులను గుర్తించి వారితోనే ప్రభుత్వం సెటిల్‌మెంట్, వారికే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయస్థానం ఆశ్రయిస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సయ్యద్ మహ్మద్, సయ్యద్ షహబాబ్ ఉద్దీన్, మహ్మద్ ఫయాజ్ ఖాన్, రఫీజ్ మహ్మద్, అక్రమ్ సయ్యద్ పాల్గొన్నారు.